ప్రజాశక్తి
మంగళవారం 28 జనవరి 2025
5
శ్రీకాకుళం



30న వికలాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఇన్‌ఛార్జి కె.కిరణ్, జి.పి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అకాడమీ ఆధ్వర్యాన ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మానసిక వైకల్యం, దృష్టిలోపం, వీల్‌చైర్, చెవిటి, మూగ వైకల్యం ఉన్న క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వికలాంగ క్రీడాకారులకు ధ్రువపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8688146164, 94936 76789 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

- 'మీకోసం'లో రైతుసంఘం వినతిపత్రం అందజేత
- అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు : కలెక్టర్
- 'మీకోసం' కు 112 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచి రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.చంద్రరావు, కె.మోహనరావు, నాయకులు భవిరి కృష్ణమూర్తి, వెలమల రమణ కోరారు. జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులతో కలిసి సోమవారం స్వీకరించిన వినతుల కార్యక్రమంలో వారు వినతిపత్రం అందించారు. జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడంతో ధాన్యం దిగుబడి పెరిగిందని తెలిపారు. అందుకనుగుణంగా ఏడు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని తొలుత అంచనా వేసినా, ప్రభుత్వం దాన్ని తగ్గించి 4.90 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించిందన్నారు. దాని ఫలితంగా రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని తక్కువ రేటుకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా మిల్లరు బ్యాంకు గ్యారంటీలు లేవని, టార్గెట్ అయిపోయిందంటూ తిప్పి పంపుతున్నారని తెలిపారు. అధికారులు నిర్ణయించిన ప్రకారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ట్రక్ షీట్‌లు జనరేట్ చేసి ఇవ్వాల్సి ఉండగా, దళారులకు మాత్రం అర్ధరాత్రి వరకు ఇస్తున్నారని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలపై సంతకాల సేకరణ పత్రాలు అందజేత

పెరుగుతున్న ధరలు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకంపై విద్యుత్ ఛార్జీల పెంపుదల రూపంలో అదనపు భారం మోపడం సరికాదని శ్రీకాకుళం టేక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, ఎం.ఆదినారాయణమూర్తి అన్నారు. విద్యుత్ ఛార్జీల భారాలను వ్యతిరేకిస్తూ వినియోగదారుల నుంచి సేకరించిన సంతకాల పేపర్లను కలెక్టర్‌కు అందించారు. 2004 నుంచి వాడిన విద్యుత్ కోసం కట్టిన బిల్లు మొత్తం సరిపోలేదంటూ, అదనంగా సర్దుబాటు ఛార్జీల రూపంలో మళ్లీ కట్టాలంటూ భారం వేయడం సమర్థనీయం కాదన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చి, వాటి ఖరీదు కోసం వినియోగదారుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేయడం మరో భారమని చెప్పారు. కరెంటు ఎక్కువగా వాడే గంటల్లో అధిక ఛార్జీ వసూలు చేయడంతో వినియోగదారులపై మరింత భారం పడనుందని చెప్పారు.



ధాన్యం కొనుగోలుపై కలెక్టర్‌కు వివరిస్తున్న రైతుసంఘం నాయకులు

టెక్కలిలో స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తున్నారు

టెక్కలి నియోజకవర్గంలో స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ నిధుల వినియోగానికి సంబంధించి సభ్యులు ఆమోదించిన పనులను చేపట్టేందుకు ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అధికారులు సహకరించడం లేదన్నారు. జిల్లా పరిషత్ నిధులతో చేపట్టే పనుల కోసం సభ్యులు పంపిన ప్రతిపాదలకు అధికారులు అంచనాలూ తయారు చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో పనులు చేసేందుకు సర్పంచ్‌లు తీర్మానం చేసినా, పంచాయతీ కార్యదర్శులు ఎంబుక్‌లు రికార్డు చేయకుండా బిల్లులు పెట్టడం లేదన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు జెడ్‌పి గేటు ముందు కొద్దిసేపు బైఠాయించారు. డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు జోక్యం చేసుకుని వారికి లోపలికి ప్రవేశం కల్పించడంతో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దువ్వాడ వాణి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ నిర్ణయంపై జోక్యం చేసుకోవాలి

పాల సేకరణ కేంద్రాలు ఇస్తున్న పాలలో పది శాతం పాలను అర్ధాంతరంగా వెనక్కి పంపేస్తూ విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై జోక్యం చేసుకుని రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని కోరుతూ కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వెలమల రమణ, జిల్లా ఉపాధ్యక్షులు భవిరి కృష్ణమూర్తి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. విశాఖ డెయిరీలో అవినీతికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం శాసనసభ హౌస్ కమిటీ వేసి విచారణ చేస్తోందని, అంతలోనే ఈనెల 24వ తేదీ నుంచి పది శాతం పాలను వెనక్కి పంపేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

చేపల వేటకు ఇబ్బంది కలిగిస్తున్నారు

తమ రింగ్ వలలను తీసుకుని చేపల వేట చేయకుండా గార మండలం బలరాంపురానికి చెందిన కొందరు వ్యక్తులు ఇబ్బందులు పెడుతున్నారని శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లవానిపేటకు చెందిన పలువురు మత్స్యకారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశించారు.

'మీ కోసం' కు 112 అర్జీలు

మీకోసంకు మొత్తం 112 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష విజ్ఞప్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిపిఒ కె.భారతీసౌజన్య, డిఎంహెచ్‌ఒ టి.బాలమురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



జెడ్‌పి గేటు ముందు బైఠాయించిన వైసిపి నాయకులు పేరాడ తిలక్ తదితరులు



సామూహిక నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొన్న విఒఎలు

వెలుగు విఒఎల సమస్యలపై ఉద్యమం

కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగు విఒఎల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు అన్నారు. విఒఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విఒఎల ఏడు నెలలు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే సామూహిక నిరాహారదీక్షలను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు విఒఎలు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉన్నారని తెలిపారు. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలను ఏవిధంగా పోషించుకోగలరని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని, రాజకీయ వేధింపులు ఉండవని టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయిలో జాయింట్ మీటింగ్స్ నిర్వహించాలని కోరారు. విఒఎల మెడపై కత్తిలా ఉన్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేసి, విఒఎల ఉపాధిని కాపాడాలన్నారు. విఒఎలకు పని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

దీక్షలకు సిఐటియు జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు త్రినాథరావు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో విఎఒల ఉద్యోగుల సంఘం నాయకులు డి.జోగారావు, జి.యర్రయ్య, వై.అనురాధ, కె.మన్మథరావు, ఎన్.రాజేశ్వరి, నర్తు మహాలక్ష్మి, పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు న్యాయపరమైన సలహాలు, సూచనలతో పాటు ఉచితంగా బెయిల్ పొందడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖైదీలకు రూపాయి ఖర్చు లేకుండా బెయిల్ పొందడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఇంతవరకు వంద కేసులకు పైబడి డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా బెయిల్‌ను ఇప్పించినట్లు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ లీగల్ ఆఫీసర్‌గా కొమరాపు ఆఫీసునాయుడు తెలిపారు. మరో 50 కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించామన్నారు. మరో 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో కౌన్సిల్ ప్రతినిధులు పుట్టా అంజనీ కుమార్, పైడి హర్షవర్ధన్, గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



సూర్య నమస్కారాలు చేస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

అరసవల్లిలో సూర్య నమస్కారాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో సోమవారం సూర్య నమస్కారాలు నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఇతర జిల్లా అధికారులు, యోగా శిక్షకులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రథసప్తమి వేడుకలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించి ఆ వైభవాన్ని నలుదిశలా చాటి చెబుదామని పిలుపునిచ్చారు. వచ్చే నెల రెండో తేదీన సూర్య నమస్కారాలతో మూడు రోజుల వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. సుమారు ఐదువేల మందితో 80 అడుగుల రోడ్డులో రికార్డు స్థాయిలో సూర్య నమస్కార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వేడుకల ప్రారంభం రోజు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. కోలాటం, తప్పెగుళ్లు చెంచు బాగోతం, చెక్కభజన, తుర్పు భాగవతం, తాలీ ఖానా, నాద స్వరం, పెద్దపాడు డప్పు వాయిద్యం, గిరిజనుల థింసా నృత్యం, నేలవేషాలు వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. గణపతి శర్మ (సంగీతం), నీరజా సుబ్రమణ్యం, శ్రీకాంత్ బృందం, సంప్రదాయం గురుకులం ద్వారా నృత్యాలు, ప్రముఖ గాయకురాలు మంగ్లీతో ఆర్కెస్ట్రా వంటివి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఆలయ ఇఒ వై.భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహా మండలి సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తక్కువ జననాలు సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, హిరమండలం, సంతబొమ్మాళి మండలాల్లో నమోదవుతున్నాయని... వెంటనే ఆయా చోట్ల ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మూడు నెలల కాల వ్యవధిలో రిజిస్ట్రేషన్, అబార్షన్, డెలివరీలు పరిశీలించి కారణాలు తెలుసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ ఫారం-ఎఫ్ తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 114 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కొత్తగా ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాటు చేసిన పది స్కానింగ్ కేంద్రాలు మినహా మిగిలిన అన్నిచోట్ల సిసి కెమెరాలు ఉన్నాయన్నారు. ఆయాచోట్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు మాట్లాడుతూ ప్రసవానికి ముందు, అనంతరం ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎచ్చెర్ల మండలంలో స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు డిఎంహెచ్‌ఒ టి.శ్రీకాంత్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, కమిటీ సభ్యులు వైద్యులు రాజేష్ కుమార్ ప్రదాన్, పి.స్వర్ణలత, విద్యాసాగర్, పలు ఎన్‌జిఒ సంఘాల ప్రతినిధులు ఆర్.శ్రీనివాసరావు, మంత్రి వెంకటస్వామి, రమణమూర్తి, డిఐఒ రామదాసు, డిపిఎంఒ బి.రవీంద్ర, డెమో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ, శ్రీచైతన్య కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.పవిత్ర డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీచైతన్య, నారాయణ కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలో ఒక విధంగా ఫీజులు చెప్పి, చేరిన తర్వాత రెట్టింపు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పుస్తకాలు, యూనిఫారం, పరీక్షలు, పేపర్ల పేరుతో పలురకాల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నారని తెలిపారు. స్టడీ అవర్స్ పేరుతో ఎక్కువ సమయం కళాశాలల్లో ఉంచి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, దాన్ని తట్టుకోలేక కొందరు విద్యార్థులు కళాశాలల్లోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల అనంతపురం జిల్లాలో ఒక విద్యార్థి ఇలాగే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితులనే విద్యార్థులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలపై సమగ్ర దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖగేష్, చిన్న, జయరాం, హేమంత్ ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పెట్టుబడులు రాబట్టడానికి సిఎం కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల దావోస్ పర్యటనలో రాష్ట్రాన్ని ప్రమోట్ చేశారని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగాలపై ముందుచూపు రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలు సైతం రాష్ట్రం వైపు చూసేలా కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖలో ఐటి రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల యువతకు ఎంతగానో ప్రయోజనం దక్కుతుందన్నారు. సమావేశంలో తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కలగ జగదీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

దావోస్ పర్యటన విజయవంతం

కవిటి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన విజయవంతమైందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులు వారి రాష్ట్రాల ప్రయోజనాల కోసమే ప్రయత్నిస్తే, చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలతో పాటు దేశానికే ప్రాతినిధ్యం వహించారని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సిఎం, మంత్రి లోకేష్ దావోస్ పర్యటన విజయవంతంగా ముగించారని తెలిపారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ చంద్రబాబు విజన్ మెచ్చుకోవడం విజన్-2047 విజయాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు.

వికలాంగుల ఉపకరణాలకు డివిజన్ స్థాయి శిబిరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వికలాంగుల సహాయ ఉపకరణాలకు డివిజన్ స్థాయి గుర్తింపు శిబిరాలను ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వికలాంగుల శాఖ ఎడి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్‌ఆర్ నిధుల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న శ్రీకాకుళం జిల్లాపరిషత్‌లో, 29న టెక్కలి తహశీల్దార్ కార్యాలయంలో, 30న పలాస ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు గానీ ఓటరు కార్డు, ఆధార్ కార్డు, అంగవైకల్యం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, యు.డి.ఐ.డి కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ శిబిరాలు సహాయ ఉపకరణాల గుర్తింపు మాత్రమేనని, ఎలాంటి వైద్య ధ్రువీకరణ పత్రాలు గానీ ఫించన్లు గానీ మంజూరు చేయబడవని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE M.A.CT-CUM-4th ADDITIONAL DISTRICT JUDGE (SC'S & ST'S JUDGE COURT), AT SRIKAKULAM
MV.OP 94/2024

Between:-
Gunda Polamma and 2 Others ....Petitioners
And:-
Busala Manikanata and 2 Others. .....Respondents

R-2: Pasala Laxmi, W/o Srinivas Rao, Age 38 Years R/o Akulatampara-Village, Kothuru Mandalam, Srikakulam-District. Owner of the Motor Cycle B.No AP 39 DM 0201.

NOTICE

Please take this notice in the above matter that the above matter is posted to 19-02-2025 for your appearance. You are here by directed to appear before the above court at **10.30 AM On 19-02-2025** in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence.

// By Court Order //

MAJJI SAMPATH KUMAR
S.SRINIVAS RAO
AMRUTHA DHAVALA
ADVOCATES,
SRIKAKULAM, CELL: 9440001170.

CHANGE OF NAME

G ARUNA K Spouse Of No JC442208X, SUB: SATTEYYA KOMARA, Resident house No.1-39, Kottapeta Village Komaralathada (Post) Tehsil Vajrapukotturu. Srikakulam Dist, Pin Code 532218, Andhrapradesh Have Changed my Name **G ARUNA K** to **KOMARA ARUNA** vide Affidavit dated 23-01-2025 before Arikithota Krishna Raju Advocate and public Notary, Srikakulam District, AP.

పాస్ పోర్ట్ పోయినది

నేను **శివంగి పార్వతీశం** S/o డిల్లేశ్వర రావు, వయసు 28 సం॥, ఇంటి నంబరు 3-337, గొనకపాడు వీధి, కొర్లాం గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లా , ఆంధ్రప్రదేశ్ 532264.

నా యొక్క పాస్ పోర్ట్ నంబరు P9551833 కొర్లాం నుంచి బారువ కి బస్ లో బ్యాంక్ పని కోసం వెళ్తుండగా మార్గ మధ్యంలో నా పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల బారువ పోలీస్ స్టేషన్‌లో గాని ఈ కింది ఫోన్ నంబరు కు గాని తెలియ చేయగలరు.

ఫోన్ నంబరు: 96525 83466

దావా సమను
మహారాజశ్రీ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.260/2017

Between :
రుంకాన సత్యనారాయణ ......వాది
And:
వేముల బాల రాంబాబు వగైరాలు .....ప్రతివాదులు
To:
D4. వేముల శ్రీవల్లి, D/o. లేటు నారాయణరావు, W/o. కటకం పూర్ణచంద్రరావు, కుప్పిలి వారి వీధి, మెట్టక్కివలస, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్, పిన్-532185

వాది దాఖలు చేసిన పై నెంబరు గల దావాలో మీరు నాలుగవ ప్రతివాది అయి ఉన్నారు. వాది మీకు చాలా సార్లు కోర్టు ద్వారా సమన్లు పంపించిననూ మీరు సమను అందుకోనందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము మీకు దావా సమనును ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయమన్నందున, మీరు మీ పైన వాది గారు వేసిన దావాలో స్వతహాగా గాని సంపూర్ణముగా సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తర్వులు చెప్పగూడిన ప్లీడరు ద్వారా గాని సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు తే.06.02.2025 దీన ఉదయం గం.10.30 నిలకు పై కోర్టు వారి యెదుట హాజరు కావలెను. కనుక పై నెంబరు గల దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై కోర్టువారికి మనవి చేసుకోవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు అని ఈ పత్రిక ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

P. హరగోపాల్
అడ్వకేట్, విజయనగరం
Cell No.:9440721142


విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్

సాంకేతికతదే భవిష్యత్

ప్రజాశక్తి- నరసన్నపేట

భవిష్యత్‌లో సాంకేతికతదే అగ్రస్థానమని, అందులోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ ముందు ఉంటాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై పట్టున్నవారు మేటి అవకాశాలు సొంతం చేసుకుంటారన్నారు. ఆ దిశగా ఆలోచించి పద్మావతి జూనియర్ కళాశాల ఐఐటి మద్రాస్‌తో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగమవ్వడం సంతోషమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం


వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో స్వీకరించే అర్జీలు సత్వరమే పరిష్కరించాలని, ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి చట్టప్రకారం పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి 54 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు.


నియామక పత్రాలను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలను చేపట్టారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ క్యాంపు కార్యాలయంలో నియామకపు పత్రాలను సోమవారం అందజేశారు. కొత్తగా నియమితులైన వారు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సి-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

పలాస: సిఎం చంద్రబాబునాయుడు ముందుచూపు, నారా లోకేష్ కృషి కలిపితేనే రాష్ట్రంలో పరిశ్రమలు వెల్లువలా స్థాపించడానికి ముందుకు వస్తున్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలతో నూతన వెలుగులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్న పార్టీ నాయకులకు ఆమె పలాస నియోజకవర్గ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఎఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారని, దేశం తరుపున సిఎం దావోస్ వెళ్లి తలసరి ఆదాయాన్ని దేశంలో అగ్రగామిగా నిలపాలని తీవ్ర కృషి చేశారన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కళాశాల విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని ఆర్‌డిఒ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్య, పరీక్షలు, భవిష్యత్ వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరణకుమారి, అధ్యాపకులు హనుమంతు రాజశేఖర్, సత్తారు లక్ష్మీపతి, కవిటి విజయ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్ద లక్ష్మీపురానికి చెందిన బూరగాన బాలకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబం పేదరికం దృష్ట్యా గ్రామస్తులు రూ.20 వేలు నగదు, బియ్యాన్ని సేకరించి కుటుంబానికి సోమవారం అందించి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో బి.లలిత కుమారి, బి.కలవయ్య, జి.రామారావు, వెంకటరావు, తేజేశ్వరరావు, బాబురావు, గోవింద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎందుకీ ప్రోటోకాల్ రగడ

- నౌపడలో ప్రజాప్రతినిధుల అతి
- అధికారులు ఇబ్బందులు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పూర్తిగా రాజకీయ చైతన్యం కలిగిన గ్రామం. ఇక్కడ నాయకులు, ప్రజా ప్రతినిధులు తీరుతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ చేస్తున్న రగడతో మండల వ్యాప్తంగా అధికారులు, ప్రజల నుంచి విమర్శలు పాలవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నౌపడ సచివాలయం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్యదర్శి పతాకావిష్కరణ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికార పార్టీ నాయకులకు, ప్రతిపక్ష వైసిపి నాయకులకు ఉన్న రాజకీయ వైరం వల్ల పతాకావిష్కరణ సమయంలో ప్రోటోకాల్ రగడ ఏర్పడింది. ముందుగా గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసిలకు, గ్రామ పెద్దలకు, మాజీ ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. అయితే మేజర్ పంచాయతీ నౌపడలో మూడు ప్రాథమిక పాఠశాలలు, ఒక హైస్కూల్, ఒక కళాశాల, రెండు సచివాలయాలు ఉన్నాయి. సచివాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు జరిపే గణతంత్ర వేడుకల్లో నాయకులు పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల మధ్య సమన్వయ లోపంతో ఒక నాయకుడు వచ్చినప్పుడు మరో నాయకుడు అందుబాటులో లేకపోవడంతో ఒక్కొక్కరు రెండు మూడుసార్లు కార్యాలయాలకు తిరగడం జరిగింది. దీంతో తీవ్ర అసంతృప్తి చెందిన వైసిపి నాయకుడు పిలకా రవికుమార్ రెడ్డి అసహనంతో అలిగి ఇంటికి వెళ్లిపోయారు. తానే సర్పంచ్‌నని తనకు ఆహ్వానించి గంటలు తరబడి నిలబెడుతున్నారని అధికారులపై ఒంటి కాలుపై లేచారు. ఆయనతో పాటు ఉన్న మరికొందరు నాయకులు కూడా అసంతృప్తి రాగం వెలగక్కారు. అధికార పార్టీ నాయకులకు పదవులు లేకపోయినా మండలంలో సుమారు అన్ని పంచాయతీల్లోనూ తగిన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ కార్యక్రమాలన్నింటికీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అలాగే సర్పంచ్‌లు, వైసిపి సానుభూతిపరులైన వారికి కూడా సభలకు సమావేశాలకు ఆహ్వానం పలుకుతున్నారు. అయితే ఇక్కడ మాత్రం ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచ్ పిలక బృందాదేవి, ఎంపిటిసి సభ్యులు లోపింటి దమయంతి, బత్సల సుధాకర్ ఎవరూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు వ్యక్తిగతంగా హాజరు కాలేదు. పైగా వారి ప్రతినిధులు అంటూ వచ్చిన నాయకులు మాత్రం తామే నాయకులమని హడావిడి చేశారు. పైగా ప్రోటోకాల్ ఉల్లంఘన చేశారని అధికారులపై దుర్భాషలాడారు. అంతేకాకుండా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని, ప్రజాప్రతినిధుల భర్తలే హడావిడి చేయడం, ప్రోటోకాల్ పేరుతో గౌరవం ఆడుక్కోవడం చూస్తుంటే ప్రజలు, అధికారులు నవ్వుకుంటున్నారు. నౌపడ పంచాయతీలో ఈ ప్రోటోకాల్ రగడ కొత్తేమీ కాదు గతంలో కూడా గ్రామసభలో ప్రోటోకాల్‌పై నాయకులు తోపులాట చేసుకుని చొక్కాలు చింపుకున్న సందర్భాలున్నాయి. మరోవైపు గ్రామంలో టిడిపి రెండు వర్గాలుగా విడిపోయి ఎవరి రాజకీయం వారు చేస్తున్నారు. దీంతో అటు ప్రతిపక్షంతోను ఇటు అధికారపక్షంలో వర్గాలతోనూ సమాధానాలు చెప్పుకోలేక, ఎవరిని నొప్పించలేక అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ అంతర్గత రాజకీయ విభేదాలతో ఏఒక్క అధికారి ఇక్కడ ఇబ్బందులు పడకుండా పని చేయలేకపోతున్నారు. మరోవైపు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కూడా ఇక్కడ పని చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఇన్‌ఛార్జితోనే కాలం గడపాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా రాజకీయ నాయకులు వైరం వదిలి, పంతాలకు పోకుండా అధికారులకు సహకరించి పంచాయతీ అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ఇచ్ఛాపురం: స్వర్గీయ మాజీ సిఎం నందమూరి తారక రామారావు స్థాపించిన టిడిపి ఆవిర్భావంతో ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం మండలంలో సన్యాసిపుట్టుగలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ రాజకీయాలంటే తెలియని వారికి టిడిపి ఆవిర్భావంతో రాజకీయ చైతన్యం, పరిజ్ఞానం వచ్చిందన్నారు. అంతకు ముందు గ్రామంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, నిర్మలా రెడ్డి, దక్కత్ ఢిల్లీరావు, పద్మనాభం, సహదేవ్ రెడ్డి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

ఆమదాలవలస: జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు కోరారు. సోమవారం విశాఖపట్నంలో జరుగుతున్న టూరిస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సులో మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పురాతన దేవాలయాలు, బీచ్‌లు పలు విశిష్టత కలిగిన పర్యాటక ప్రాంతాలను వివరిస్తూ వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రామ్మోహనరావు తెలిపారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చెరువుకు దారి చూపించాలి

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఎర్రబంధ చెరువుకు వెళ్లడానికి దారి చూపించాలని రైతులు కోరారు. సోమవారం తహశీల్దార్ గ్రీవెన్స్‌లో తహశీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందజేశారు. పూర్వం నుంచి రైతులు నడిచి వెళ్లేదారి ఆక్రమణలకు గురైందని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. పొలాలకు రైతులు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో కేశవరావు, చిన్నారావు, సవరయ్య, మృత్యుంజయరావు ఉన్నారు.

రోజు విడిచి మంచినీటి సరఫరా

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేయబడునని పురపాలక సంఘం కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘానికి మంచినీటిని సరఫరా చేసే మండలంలోని అలమాజీపేట హెడ్ వాటర్ వర్క్స్ నందు వంశధార నదిలో ఇసుక మేటలు ఏర్పడడం వలన బావులకు నీరు అందకపోవడం వలన మంచి నీరు బావులకు చేరే విధంగా మరమ్మతులు చేపడతుండడం వలన ఈ నెల 28 మంగళవారం నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా చేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు కలుగుతున్న అంతరాయానికి చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కొత్తూరు: జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం సిఐ చింతాడ ప్రసాదరావు పర్యవేక్షణలో కొత్తూరు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ, హిరమండలం ఎస్ఐ మహమ్మద్ యాసిన్‌లు వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేని 50 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు హెల్మెట్ తెచ్చుకొని వాహనం తీసుకువెళ్లాలని సూచించారు.

ఫిబ్రవరిలో ఉత్తరాంధ్ర పాల పోటీలు


కోటబొమ్మాళి: ఫిబ్రవరి చివరి వారంలో పాత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిల గల పాడి పశువుల మధ్య పాల పోటీలు నిర్వహించటం జరుగుతుందని, ఆసక్తిగల పాడి రైతులు తనకు సంప్రదించాలని స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు మూడు జిల్లాలకు చెందిన పాడి రైతులు తమ పశువులను పట్టుకొని విజయనగరం జిల్లా తోటపాలేం గ్రామానికి చేరుకోవాలని, అక్కడ మూడు రోజులు ఉండాల్సి ఉంటుందని పశువులకు రవాణా, వసతి, దాణా, నీటి సౌకర్యంతో పాటు రవాణా సమయంలో భీమా సదుపాయం ఉచితంగా కల్పించబడుతుందన్నారు. ఎక్కువ పాలు ఇచ్చిన పశువులకు ప్రథమ బహుమతి కింద రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు, తృతీయ బహుమతి రూ. 25 వేలు పాడి రైతులకు అందజేయటం జరుగుతుందన్నారు. ఆసక్తి గల పాడిరైతులు 768085477 నంబర్‌కు ఫోన్ ద్వారా గానీ, నేరుగా గానీ సంప్రదించాలన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.54 లక్షలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 54 లక్షలు నిధులు మంజూరు చేసింది. గతేడాది డిసెంబర్ 31న 'మందుబాబులకు అడ్డాగా' అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్పందించారు. మండల అధికారులతో సమీక్ష చేసి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే యుద్ధ ప్రతిపాధికన పాఠశాల ప్రహరీ రక్షణగోడ నిర్మాణానికి ఎస్టిమేట్ తయారు చేసి, నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించగా వెను వెంటనే నిధులు మంజూరు అయ్యాయి. దీంతో పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పాఠశాల ప్రాంగణం హద్దులు తదితర పూర్తిస్థాయి పాఠశాల విస్తీర్ణం ఎంత ఉందో తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు సర్వే చేస్తున్నారు. ఇటీవల కొంతమంది పాఠశాల ప్రాంగణంలో అనధికారికంగా ఆలయ నిర్మాణానికి


రక్షణగోడ నిర్మాణానికి సిద్ధం చేసిన మెటీరియల్

పూనుకోవడంతో అనధికారిక నిర్మాణలపై ప్రజాశక్తిలో కథనం రావడంతో వెంటనే స్పందించిన రెవెన్యూ, విద్యాశాఖాధికారులు అక్రమ నిర్మాణాలు అడ్డుకొని పనులు నిలుపుదల చేయించారు. నెలరోజుల్లో పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి మెటీరియల్ సిద్ధం చేస్తున్నారు. రక్షణగోడ నిర్మాణానికి రూ.54 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

వజ్రపుకొత్తూరు: నిలుపుదల చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తక్షణమే తెరిచి కొనుగోళ్లు వెంటనే జరపాలని సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొని పంట పండిస్తే, ఆ పంట నేల పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాల నుంచి పంటను కాపాడి నూర్పులు చేస్తే నేడు ధాన్యం అడవి పందులు, ఎలుకలు, చెదలు పాలవుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. నేటికీ ధాన్యం అమ్మే రైతుల అకౌంట్‌లోకి డబ్బులు జమ చెయడం లేదన్నారు. రంగుమారిన ధాన్యాన్ని వాపసు చేయడాన్ని నివారించాలని కోరారు. సన్నబియ్యం రకం, సాంబ మసూరి గతంలో దిగుబడి తగ్గినా ధర రైతుకు గిట్టుబాటు అయ్యేదని ప్రస్తుతం ఆ ధాన్యానికి కనీస ధర లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.భాస్కరరావు, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, రైతు సంఘం నాయకులు నీలాచలం, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో ఉన్న మదనాపురంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో సోమవారం మంచినీటి బోర్ ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. ఇటీవల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే మంచినీటి బావిలో గుర్తు తెలియని వ్యక్తి (యాచకుడు) పడి మృతి చెందిన విషయం విధితమే. అయితే గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దీనిపై స్పందించిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తక్షణమే గ్రామంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలుగా బోర్‌ను మంజూరు చేశారు. సోమవారం బోరు ఏర్పాటుకు ఆనెపు వరలక్ష్మి ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు పనులను పర్యవేక్షించారు. మజ్జి అప్పలనాయుడు, గ్రామ సచివాలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


బోరు పనులను పరిశీలిస్తున్న రామకృష్ణనాయుడు తదితరులు

చంద్రబాబును విమర్శించే స్థాయి చింతాడకు లేదు


మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి- ఆమదాలవలస


చంద్రబాబును విమర్శించే స్థాయి వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్‌కు లేదని టిడిపి న్యాయ విభాగ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చింతాడ రవికుమార్ ఉనికిని కాపాడుకోవడానికే ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ దావోస్ వెళ్లి రూ.90 కోట్లు వృధా చేశారని విమర్శించడం రవికుమార్ తెలివి తక్కువకు నిదర్శనమన్నారు. దావోస్‌లో చంద్రబాబుకు పారిశ్రామిక దిగ్గజాలు రెడ్ కార్పెట్ పరిచాయన్న సంగతిని వైసిపి నాయకులు గుర్తెరగాలన్నారు. 2019 - 24లో వైసిపి హయాంలో 125 కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించ లేకపోతే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లకు ఉపశమనం కలిగించారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లను నమ్మి పెద్దపెద్ద సంస్థలు ఎపిలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా ఎన్నికకాని చింతాడ చంద్రబాబు దావోస్ పర్యటనపై విమర్శలు చేయడం అవివేకమన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకుల తీరు మారకపోతే నియోజకవర్గ ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మండల టిడిపి నాయకుడు నూక రాజు, రాష్ట్ర టిడిపి బిసిసెల్ కార్యదర్శి బోర గోవిందరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, పట్టణ బిసిసెల్ అధ్యక్షుడు తంగి గురయ్య, కాగితాపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సూర్య నమస్కారాలు చేయించారు. ప్రతిరోజు సూర్య నమస్కారాలు అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని హెచ్‌ఎం కె.చైతన్య అన్నారు. విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని సూర్య నమస్కారాలు ప్రాధాన్యత వివరించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: సూర్య నమస్కారాలు, యోగా చేయడంతో ఆరోగ్యం కలుగుతుందని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి సమితి, విద్యావిహార్ పాఠశాల ప్రాంగణంలో, జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వాకర్స్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి సూర్యనమస్కారాలు, యోగా ఆసనాలు వేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని అందరికి ప్రచారం చేయాలని ఆర్‌డిఒ సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతరావు, సత్యసాయి సేవాసమితి, విద్యావిహార్ డైరెక్టర్ మల్లా రామేశ్వరం, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నౌపడ : సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం సూర్యనమస్కారాలు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులచే సూర్యనమస్కారాలు చేయించాలని కోరారు. రదసప్తమి రోజున ప్రతి పాఠశాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కోరారు. రథసప్తమి వేడుకలు విజయవంతం కోసం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో యోగా ఆభ్యసనాలు చేయించాలని అధికారులు కోరారు.

వంజంగి సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


సత్యవతి (ఫైల్)

మండలంలోని వంజంగి గ్రామ సర్పంచ్ బెండి సత్యవతి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమదాలవలస జెడ్‌పిటిసి బెండి గోవిందరావు సతీ మణి సత్యవతి గత కొంతకాలం నుంచి కేన్సర్ వ్యాధితో విశాఖపట్నం గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. సోమవారం వంజంగిలోని స్వగృహం వద్ద తుదిశ్వాస విడిచారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఎమ్మెల్యే సంతాపం

కేన్సర్‌వ్యాధితో మృతిచెందిన సర్పంచ్ బెండి సత్య వతి మృతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ సంతాపం వ్యక్తం చేసి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఆమె మృతిపై సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: జాతీయ రహదారిలో పొడుగుపాడు గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం బోరుమజ్జిపాలెంకు చెందిన కరుకోల శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాసరావు శ్రీజగన్నాథపురం వైపు నుంచి కోటబొమ్మాళి వైపు వస్తుండగా తన ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.


ఆర్‌డిఒకు సన్మానం చేస్తున్న అధికారులు

ఆర్‌డిఒకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అవార్డు లభించడంతో తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తితో పాటు రెవెన్యూ అధికారులు విఆర్‌ఒలు ఘనంగా సన్మానించారు. ఇటువంటి మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికు అవార్డు లభించడంతో రెవెన్యూ అధికారులు, విఆర్‌ఒలు, కార్యాలయ సిబ్బంది తహశీల్దార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వి.గిరి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సునంద, ఆర్ఐ ఖగేశ్వరరావు, ఎఎస్ఒ జోగారావు, విఆర్‌ఒలు కొర్ల శ్రావణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మోడల్ పేపర్లు

మోడల్ పేపర్ల పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దోకులపాడు ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ సౌజన్యంతో స్నేహ కళామండలి ఆర్థిక సహాయంతో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లను పాఠశాల ఆవరణలో సోమవారం హెచ్‌ఎం వరలక్ష్మి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి మోడల్ పేపర్లు అందించడానికి ముందుకు రావడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల బంగారు భవితకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, యుటిఎఫ్ ప్రతినిధి ఢిల్లేశ్వరరావు, సంఘ ప్రతినిధులు పి.మోహనరావు, తిరుపతి, రమేష్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

'ఉపాధి'తో వలసల నివారణ

ప్రజాశక్తి- కవిటి

వలసల నివారణే ప్రథమ లక్ష్యంగా ఉపాధిహామీ పనులు చేపడుతున్నట్టు జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్ తెలిపారు. మండలంలోని పెద్ద మెళియాపుట్టుగలో సోమవారం రూ. 22 లక్షల అంచనా వ్యయంతో ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అవసరమైన అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆరంగి మధు, వజ్జ రంగారావు, బెందాళం సురేష్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఎ-3 పరీక్షలు

టెక్కలి: విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఎఫ్‌ఎ-3 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం పూట పరీక్షలు జరగ్గా ఉన్నత పాఠశాలల్లో రోజుకు రెండుపూటలా పరీక్షలు జరగనున్నాయి. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఒఎంఆర్ షీటు విధానాన్ని మరలా ప్రవేశ పెట్టారు. 6 నుంచి పదవతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్రశ్నాపత్రంలో మార్పులు చేసుకువచ్చారు. గతంలో 20 మార్కులకే ప్రశ్నాపత్రం ఉండగా ఇప్పుడు 35 మార్కులకు ప్రశ్నాపత్రం ఇవ్వనున్నారు. వీటిలో 20 మార్కుల వరకే ఒఎంఆర్ షీటు ఉండగా, మిగిలిన మార్కులకు సమాధానాలు జవాబుపత్రాల్లో విద్యార్థులు రాయాలి.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

లోకేష్ పాదయాత్ర కొత్త అధ్యాయం

ప్రజాశక్తి- నరసన్నపేట

ఐటి, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేష్ పాదయాత్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తిగా పాదయాత్ర చేసి రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి యువనేత లోకేషే కీలకపాత్ర పోషించారని, అరాచక పాలనపై సమరశంఖం పూరించి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర నేటితో రెండేళ్లు పూర్తి కావడం సంతోషకరమన్నారు. 226 రోజుల పాటు 3132 కి.మీ.ల మేర రాష్ట్ర ప్రజల ఆశీస్సులు, అపూర్వ ఆదరణ మధ్య యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండలాల టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రామును సన్మానిస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

రాముకు అవార్డుపై హర్షం

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 7వ వార్డు చింతాడకు చెందిన తోట రాముకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవారత్న అవార్డు ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న రాముకు చేయూత సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసి సోమవారం విశాఖపట్నం గ్రంథాలయ సంస్థ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ జాతీయ డైరెక్టర్ డాక్టర్ ఆమోస్ జేమ్స్, సుప్రీంకోర్టు న్యాయవాది కె.కరుణాకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వైఎస్ చిన్నారావు చేతులమీదుగా రామును సత్కరించి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించారు. రాము అవార్డు పొందడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా దళిత సంఘ నాయకులు ఎడ్ల ఈశ్వరరావు, గుర్రాల చినబాబు, అదపాక గౌరునాయుడు, పొన్నాడ అప్పలసూరి, ఇల్లాకుల ప్రభాకర్, సవలాపురపు రాజారావు, ఇల్లాకుల సూర్యప్రకాశరావు తదితరులు అభినందనలు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీరావు, తదితరులు

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి

పలాస: మండలం బొడ్డపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి పనులు జరగడం లేదని, తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వసంత కుమార్, పంచాయతీ విస్తీరణాధికారి మెట్ట వైకుంఠరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించారని, అప్పటి నుంచి పంచాయతీలో ఉన్న ఉపాధి కూలీలకు ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో ఎక్కువ మంది ఉపాధి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా సచివాలయంలో కార్యదర్శి లేరని, ఉన్న డిజిటల్ అసిస్టెంట్‌ను ఆర్‌డిఒ కార్యాలయానికి తరలించారని దీంతో గ్రామంలో పనులు జరగడం లేదని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఎంపిడిఒ వసంత కుమార్ స్పందించి గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులు జరిగేలా చర్యలు చేపడతామని హామీఇచ్చారు.

'ఐతమ్' ఐటి విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల రెండో ఏడాది బిటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)కి చెందిన 190 మంది విద్యార్థులకు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 8 వరకు 'వెబ్ టెక్నాలజీస్ యూజింగ్ డిజంగో' అనే అంశంపై రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఎంఎస్ ఎక్సెన్స్ ల్యాబ్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటి హెచ్‌ఒడి డాక్టర్ బి. రమేష్ నాయుడు, ఎపిఎస్-ఎస్‌ఒసి స్పాక్ డాక్టర్ బి.రామారావు, ట్రైనర్ టి.సుకన్య, ఐటి కో-ఆర్డినేటర్ జె.చిరంజీవి, సిఎంఎస్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి.అనూష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పురాతన భవనాన్ని పరిశీలిస్తున్న ఇంటాక్ బృందం

వారసత్వ సంపదను పరిరక్షించడమే ధ్యేయం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

భారతీయ కళలు, సంస్కృతి, వారసత్వ సంపదనను భావితరాలకు అందించేందుకు ఇంటాక్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ కో కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు అన్నారు. జిల్లా న్యాయస్థానం ఆవరణలోని 1910 నాటి పురాతన భవనాలను ఇంటాక్ బృందం సోమవారం సందర్శించింది. ప్రాచీన కట్టడంగా ఉన్న భవనాన్ని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఇంటాక్ సీనియర్ సభ్యులు కె.రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

కోటబొమ్మాళి: మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న షణ్ముఖ మాస్టర్ రూ.21 వేలు విలువగల 55 వాట్స్ కలిగిన సౌండ్ సిస్టమ్, మూడు మైకులు సోమవారం వితరణగా అందజేశారు. గతేడాది కూడా రూ.6 వేలుతో పోర్టబుల్ వైట్‌బోర్డు, స్టాండ్‌లు అందజేశారని పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు తెలిపారు. పాఠశాలకు, విద్యార్థులకు ఎంతో అవసరమైన ఈ వస్తువులు బహుకరించడంతో ఆయనకు గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సింహాచలం, సంతోష్, ఎస్ఎంసి చైర్మన్ అల్లాడ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను పాడి రైతులు వినియోగించుకోవాలి


పొందూరు : నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారిని దివ్య


లావేరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుజాత



వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను అవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పాడి రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు వినియోగించు కోవాలని మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు అన్నారు. సోమవారం మర్రిపాడులో సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గూడ ఈశ్వరరావు, ఎంపిటిసి పిట్ట సుగుణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.సాంబమూర్తి, టిడిపి నాయకులు ఎల్.భీమారావు, ఆర్.శాంతమూర్తి, పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, జూనియర్ వెటర్నిటి అసిస్టెంట్ దేవేంద్ర, సచివాలయ సిబ్బంది పద్మ, సంతోష్, మాధురి, చిన్నబాబు, ధర్మారావు, నారాయణరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

లావేరు: తాళ్లవలసలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో లావేరు పశువైద్యాధికారి గాయత్రి, పశు వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లేగ దూడలకు నట్టల మందు, మేకలకు, గొర్రెలకు, కోళ్లకు టీకాలు వేశారు. అలాగే ఎదకు రాని పశువులకు మందులు, చూడి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, వైద్యాధికారి కె.దివ్య, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, ఖండాపు శ్రీనివాసరావు, పారమనాయుడు, సురేష్, మనోహర్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలాస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు మధు రైతులకు సూచించారు. మండలం బొడ్డపాడులో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు చెందిన మేకలు, గొర్రెలు, అవులకు వ్యాక్సిన్లు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిక్కిర ఢిల్లీరావు, రైతులు ఎం. కుమారరాజు, ఢిల్లీరావు, పి.చిరంజీవులు, ఎ.పి.మన్మథరావు, బి.జగన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మందస: మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో జిల్లుండ, చీపి సచివాలయాలల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లి చంద్రయ్య, కుప్పాయి కూర్మారావు, గార వెంకటరావు, గార కూర్మారావు, ధర్మేంద్ర, ధనుంజయరావు, బాలకృష్ణ, శ్రీను, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలం మేఘవరంలో డా.ఎం.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 17 పశువులకు గర్భకోశ చికిత్సలు, 42 పశువులకు ఏలిక పాము నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లు మాధవరావు, మాజీ ఎంపిటిసి కెల్లి శ్రీరాములు, సిబ్బంది వి.ఎ.జి వరలక్ష్మీ, జెవిఒ జె.చిన్నమ్మ, ఎం.అనిల్ కుమార్, ప్రసాదరావు, ధనలక్ష్మీ, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- లావేరు

విద్యాతోనే అభివృద్ధి సాధ్యమని , ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపిడిఒ పి. వెంకటరాజు అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత స్వయంశక్తి సంఘాల మహిళలకే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులను వీడియో రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎపిఎం బి.వి.సుబ్బయ్య నాయుడు, మోహన్, శ్రీదేవి తదితరులున్నారు.


లావేరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరాజు

మందస: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని ఎంపిడిఒ సూర్యనారాయణ సూచించారు. మండలస్థాయి ఉల్లాస్ రెండవ విడత వాలంటీర్లు శిక్షణా తరగతులను మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ బి.రుషేశ్వరరావు, ఇఒఆర్‌డి జయప్రకాష్,. ఎపిఎం పైడి కూర్మారావు, వి.జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు చేయూత

ప్రజాశక్తి- సోంపేట

కోల్ ఇండియా ఆర్థికసాయంతో ఉద్దాన ప్రాంతానికి చెందిన నిరుపేద మహిళలకు రూ.ఐదు లక్షల విలువ చేసే 15 కుట్టుమిషన్లను రోటరీ ప్రతినిధులు పంపిణీ చేశారు. సోమవారం సోంపేట రోటరీ క్లబ్ ఆవరణలో ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫాస్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు (దత్త) మాట్లాడుతూ ఈ మిషన్లతో వచ్చిన ఆదాయంతో తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలకు రోటరీ ఎప్పుడు బాసటగా ఉంటుందన్నారు. సోంపేట రోటరీ క్లబ్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని, దీనికి రోటరీ అధ్యక్షుడు, జిల్లా రోటరీ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు అని కొనియాడారు. వారం రోజులు పాటుగా ఈస్ట్ గోదావరి రాగోలు గ్రామానికి చెందిన శిక్షకురాలు లలిత కుమారిచే 15 మంది మహిళలకు కుట్టు మిషన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు జుత్తు చలపతిరావు, కార్యదర్శి శివాజీ, అసిస్టెంట్ గవర్నర్ రజనీకాంత్, రోటరీ సంఘ సభ్యులు టంకాల బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సుబ్బారావు

ఇచ్ఛాపురం: హైస్పీడ్ కుట్టుమిషన్లుతో మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవచ్చునని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అర్.వి.సుబ్బారావు అన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో హైస్పీడ్ కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సిఎస్ఆర్ ప్రాజెక్టు, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కుట్టుమిషన్లు పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సంతోష్. రోటరీ క్లబ్ ప్రతినిధులు రాజకుమార్, పి.దినేష్ కుమార్, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, వి.కె.ప్రసాద్, వి.సురేష్, కె.గోపి చౌదరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట పాఠశాలను విలీనం చేయొద్దు


వినతిపత్రం అందజేస్తున్న హుకుంపేట గ్రామస్తులు

ప్రజాశక్తి- సోంపేట

మండలం కొర్లాం పంచాయతీ హుకుంపేటలో ఎంపిపి స్కూల్‌ని గోనకపాడు హైస్కూల్‌లో విలీనం చేసేందుకు విద్యాశాఖ అధికారులు నిర్ణయించడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారాల నుంచి ఆదేశాలు రావడంతో సోమవారం స్కూల్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గ్రామస్తులు కలిసి హైస్కూల్ హెచ్‌ఎం ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హుకుంపేట స్కూల్ గత పదిహేనేళ్ల నుంచి దాతలు ఇచ్చిన స్థలంలో పాఠశాల నెరవేస్తున్నారని పాఠశాలలో 43 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారని తెలిపారు. ఆ స్కూల్‌కు వెళ్లాలన్నా హైవే రోడ్డు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం వల్ల చిన్నపిల్లలు అంతదూరం వెళ్లడం ఇబ్బంది కలుగుతుందన్నారు. పాఠశాల విలీనం కాకుండా యధావిధిగా కొనసాగేలా చూసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్, పాలు దాసు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తనవంతుగా ఆర్థికసాయం అందిస్తానని టిడిపి తెలుగు యువత అధ్యక్షులు కిక్కిరి ఢిల్లీరావు అన్నారు. మండలం బొడ్డపాడు ప్రాథమిక పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఢిల్లీరావు పాల్గొని మాట్లాడారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ.50 వేలు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. విద్య ద్వారానే అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందని, అందుకు విద్యకు అత్యంత ప్రాధన్యత ఇవ్వాలన్నారు. అందువల్ల అత్యంత ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో తాను ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పోతనపల్లి గణపతి, హెచ్‌ఎం వీర్రాజు, జిల్లా పరిషత్ పాఠశాల ఎన్ఎంసి చైర్మన్ గర్తం తులసీరావు, వైస్ చైర్మన్ ధనలక్ష్మి, సర్పంచ్ తామాడ మధన్, ఉపాధ్యాయులు తులసీ, రాంజీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఢిల్లీరావు

హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ


ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- సోంపేట

ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని బారువ ఎస్ఐ ఎస్.హరిబాబు నాయుడు కోరారు. సోమవారం బారువ పోలీస్ స్టేషన్ నుంచి కొర్లం జాతీయ రహదారి వరకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ప్రమాద సమయంలో ప్రాణాలు నిలపడంలో హెల్మెట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు యువజన సంఘసభ్యులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

టెక్కలి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని టెక్కలి సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి ఆనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, మనోవర్తి, ప్రీలిటిగేషన్ వంటి కేసులు న్యాయవాదులు, పోలీసులు, సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇరువర్గాల వారిని ఒప్పించి రాజీకి యత్నించాలన్నారు. లోక్ ఆథాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమయితే కోర్టు ఫీజు వాపస్ ఇవ్వబడుతుందన్నారు. లోక్ ఆథాలత్‌ని ప్రతిఒక్కరు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

పట్టుశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పొందూరు

మండలం పట్టుశాలి సామాజికవర్గ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని పట్టుశాలి కళ్యాణ మండపంలో పట్టుశాలి సామాజికవర్గ పెద్దల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా పూంద్రు రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా పాలిశెట్టి సూర్యం, ఉపాధ్యక్షునిగా కోరుకొండ రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా మాడుగుల రామకృష్ణ, కోశాధికారిగా బండారు గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నికపై టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, పట్టణ అధ్యక్షులు ఎ.చినరంగ, ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- నందిగాం

మండలం గోల్లూరుకు చెందిన రేళ్ల నారాయణరావు ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటికీ ఇంటికి చేరకపోవడంతో బంధువులు ఇంట్లో వాకబు చేశామని ఎక్కడా లేకపోవడంతో భార్య ధనలక్ష్మి సోమవారం నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక కోర్టుల సముదాయంలో పారా లీగల్ వాలంటీర్లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జ్ కె.కిషోర్ బాబు ఒక ప్రకటలో కోరారు. పదో తరగతి కనీస విద్యార్హత కలిగి ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయ విద్యార్థులు, స్వయంసేవ సంస్థ సభ్యులు, వైద్యులు వాలంటీర్లుగా అర్హులని తెలిపారు. సోంపేట, కంచిలి, మందస మండలాల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. వాలంటీర్లకు ఎటువంటి జీతభత్యాలు, గౌరవ వేతనాలు ఇవ్వడం జరగదని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌ఫోటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్‌తో న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

పింగళి వెంకయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- కవిటి

మండల వాసుల ఆధ్వర్యంలో అండమాన్‌లో పింగళి వెంకయ్య విగ్రహావిష్కరణ సోమవారం ఘనంగా నిర్వహించారు. కవిటి మండలం నుంచి అండమాన్ వలసవెల్లిన పలువురు శ్రీ పింగళి వెంకయ్య అసోసియేషన్‌గా ఏర్పడి ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తమకు గర్వకారణమని అన్నారు. అలాగే పింగళి వెంకయ్యను ప్రభుత్వం గుర్తించి భారతరత్న ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో కవిటి మండలానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కోటబొమ్మాళి: మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు సోమవారం పంచాయతీ సర్పంచ్, మాజీ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరావు, ధనలక్ష్మిలు పెన్నులు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకుకావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పెన్నులు, నోట్ పుస్తకాలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని రాజపురంలో సోమవారం పొద్దర్ కలర్ గ్రానైట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో చాపర ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పావని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ, మాజీ సర్పంచ్ అజయ్ నాయక్, కాంతి ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణదాస్

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని తలసముద్రం పంచాయతీ కొల్లివలసలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన నక్క వరలక్ష్మి కుటుంబ సభ్యులను సోమవారం మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బయపడొద్దు అని ఆదుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, ఎంపిటిసి బావన వైకుంఠరావు, బావన వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో మహేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అప్పాపురం మాజీ సర్పంచ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గంట్యాడ మహేష్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం పరామర్శించారు. మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు విరిగిపోవడంతో విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈయనతో పాటు కొప్ప మాజీ సర్పంచ్ పిసిని జగన్నాధం, తిప్పన బాబూరావు, సురేష్ తదితరులున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

డిఇఒకు ఎస్‌టియు వినతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యా శాఖ జారీ చేసిన సవరణ సర్కులర్‌లో మార్పులు చేయాలని కోరుతూ ఎస్‌టియు ఆధ్వర్యాన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. సోమవారం నిర్వహించిన ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు ఎస్.వి రమణ, జి.రమణలు మాట్లాడుతూ 45 మంది విద్యార్థులు నమోదు గల పాఠశాలను ప్రతి పంచాయతీ కేంద్రంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సమీప పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తరలించ వద్దన్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలలో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో 50 మంది విద్యార్థులు పైగా ఉంటే వాటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతి కల్పించాలన్నారు.


సోనాలిని అభినందిస్తున్న సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకులు

రాష్ట్రస్థాయి వ్యాసరచన విజేత 'సోనాలి'

సోంపేట: శ్రీ సత్యసాయి సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తెలుకుల సోనాలి విజేతగా నిలిచింది. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సోనాలి రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ మీడియంలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు సోనాలికి రజత పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కళాశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవడంపై ప్రిన్సిపాల్ మోహనరావుతో పాటు ఆధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

సినిమా షూటింగ్ సందడి

కోటబొమ్మాళి: పిజె ప్రొడక్షన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కన్నీరు ఒటిటి మూవీ యూనిట్ సోమవారం కోటబొమ్మాళిలో షూటింగ్ నిర్వహించి సందడి చేశారు. రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో కన్నీరు ఒటిటి చిత్రం ముహూర్తం షాట్ ఘనంగా నిర్వహించామని చిత్ర దర్శకులు కాళ్ల అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనది కోటబొమ్మాళి మండలం కన్నెవలస గ్రామమని, ఈ సినిమా షూటింగ్ కోటబొమ్మాళి మండలంలో చేయటం జరుగుతుందని, ఈ ప్రాంతానికి చెందిన వారు ఇందులో నటించనున్నారని తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్‌గా పిజె ప్రొడక్షన్, ప్రొడక్షన్ మేనేజర్‌గా పంగా త్రినాద్, డిఒపిగా రాజేష్ మేడిశెట్టి, నారా ప్రసాద్‌లు వ్యవహరించారని ఆయన తెలిపారు.